
# ఉద్యోగం!

పుల్లా భాస్కరరాజు



శ్రేల్ఫులమీద కూర్చున్న గడియారం ఐదు గంటల ప్రాంతాన పెద్దగా పెడ్బొబ్బలు లంకించు కుంది. మధ్యలో ఇదొకటి నిద్రపోకుండా. దీని రాగము వినడమే ఆలస్యం వదిన వచ్చి సాగ దీస్తుంది.

దుప్పటి తొలగించుకొని లేచి కూర్చున్నాను కళ్ళు భగున మండుతున్నాయి. మళ్ళీ పడుకుందా మని దుప్పటిని కాళ్ళతో తన్ని నిండా ముసుగేసు కున్నాను. వంట గదినుండి వదిన చదువుతున్న శ్లోకాలు వినబడసాగాయి

"లేవయ్యా బాబు! వేడినీళ్లు చల్లారిపోతాయ్ సూర్యుడు నడినెత్తిమీద కొచ్చేదాక పడుకుంటావు నిద్రనుండి లేచిందె తడవు ఆఫీసుకు ఆలస్యమౌ తుందంటూ నోరు పుక్కిలించకుండానే రెండు చెంబులతో స్నానం ముగించుకొని టిఫినో అంటూ నానా హంగామా చేస్తావు."

వదిన మాటలు చెవుల్లో గింగురు మంటున్నాయి. నాకు నవ్వు ఆగింది కాదు. వదిన మీద అమిత మైన జాలివేసింది. పాపం వదిన.

అమ్మ పోయినప్పటినుండి వదిన నాకు అమ్మయి పోయింది. నాకు తల్లిలాంటి వదిన కావాలని అను క్షణమూ భగవంతుడితో ప్రాధేయపడేవాడ్ని. చివరికి నా ప్రార్థన ఆలకించాడు.

"ఏం? ఇంకా బద్దకం వదల్లేదా?' వదిన గొంతు వినబడింది.

ముఖం మీదినుంచి దుప్పటి తొలగించాను. ఎదురుగా వదిన నిలబడింది. కళ కళ లాడుతున్న వదిన ముఖం చూడగానే నాలోని బద్దకమంతా తొలగిపోయింది. సాక్షాత్తు లక్ష్మీదేవి ప్రత్యక్ష మయినట్లయింది.

"ఏమిటీ? అలా పిచ్చివాడిలా చూస్తున్నావ్?' నామీద వున్న దుప్పటిని లాగి మడత చేస్తూ అంది.

'ఈ రోజు చాలా అందంగా వున్నావ్ వదినా" నా మనస్సులోని భావాన్ని వెళ్ళగక్కాను.

"పిగ్గాని పిచ్చిపట్టిందా ఏం?" గలగలనవ్వుతూ అంది.

"ఒట్టు వదినా".

"చాల్లే త్వరగాలెయ్".

కర్టెన్, తలుపురెక్క మీదికేసి వెళ్ళిపోయింది వదిన

మంచందిగి పెరట్లోకి నడిచాను ప్రక్కగదిలో అన్నయ్య ఇంకా నిద్రపోతున్నాడు. దొడ్డిత్రోవంగా నాన్నగారు బయటికి వెళ్ళిపోతున్నారు.

స్నానం ముగించుకొని అద్దంముందు నిలు చున్నాను.

టిఫిన్ పళ్ళెంతో లోపలికి ప్రవేశించిన వదిన వదిన చేతులనుండి పళ్ళెం అందుకొని చెమ్చాతో ఉప్మాను కెలుకుతున్నాను.

చిన్నగా పిలిచింది వదిన. తలెత్తి ఆమెకేసి చూశాను.

'నేనొక విషయం అడగనా?" అనుమానంగా చూస్తూ అంది.

'అడుగువదినా. అలా సంకోచిస్తావెందుకు?' వదిన అనుమానాన్ని నవ్వుతో తేల్చేస్తూ అన్నాను.

'ఈరోజు మీకు జీతాలిస్తారటగా?"

"అవును".

తిరిగి మాట్లాడలేకపోయింది. తల కిందికేసు కుంది. వదిన ఎందుకు అడగలేకపోతుందో, దేని విషయం అడగాలని నోరు విప్పుకుందో అవగాహన చేసుకున్నాను.

"నాకు తెలుసువదినా. నీవు వేరే చెపాలా... పిల్లిగవ్వ తక్కువకాకుండా మొత్తం జీతం తెచ్చి నీ కొంగులో పోస్తాను."

"అదికాదిబాబూ..." సందర్భాన్ని మార్చివేయ

దానికి ప్రయత్నిస్తూ అంది.

"ఏదికాదు వదినా. ఈ నెలలో మనకు ఎన్ని అప్పులున్నాయో. అన్నయ్య ఎంత కష్టపడుతున్నాడో నాకు మాత్రం తెలియదేమిటి".

నా మాటలు వింటూనే చిన్నగా నవ్వుకుంది వదిన.

"అన్నయ్యను, నిన్నూ కాదని నేను ఎప్పుడూ ఏపనీ చెయ్యను వదినా".

"భగవంతుడు నిన్ను ఆశీర్వదిస్తాడు బాబూ" నిండుమనస్సుతో దీవించింది వదిన.

వదిన అమాయకత్వానికి, మంచితనానికి నాకు అమితమైన జాలివేసింది.

ఎంగిలిపళ్ళెంతో లోపలికి వెళ్ళిపోయిందివదిన.

గడియారంకేసి చూశాను, ఇంకా పది నిమిషాల వ్యవధి వుంది. ఈ పదినిమిషాల్లో ఆఫీసుకు చేరుకోగలనా? రోజులాగే ఈ రోజుకూడా అనుమానం వేసింది. మరీ ఆలోచించకుండా ఆలోచనలకు ఆనకట్టవేసి లేచాను.

గబగబా దుస్తులు మార్చుకున్నాను. అయిదు నిమిషాలు గడిచాయి. శేషం అయిదు నిమిషాలు.

'వదినా...ఓ...వదినా" ఆత్రంగా పెద్దగా అరిచాను.

ఆఁ...వస్తున్నా' వంట గది నుండి వదిన గొంతు వినబడింది.

అబ్బబ్బ. వంటిపిల్లాడిలా అస్తమానమూ అల్లరి. కాస్త ఓపిక పట్టలేవూ.. "చిరుకోపంతో అంది.

"నేనుతప్ప ఈ ఇంట్లో చంటిపిల్లాడు ఎవ డున్నాడు వదినా"

"ఎందుకని?"

"ఇలాగే అడుగుతాను"

"ఎప్పుడూ ఏడవనైనా లేదే..."

"ఈరోజు ఏడుస్తానులే వదినా."

"ఏడ్చావ్ లే. ఈ కాఫీ తాగు."

కాఫీగ్లాసు అందుకొని గట గటా త్రాగేశాను. బస్ ఛార్జికి వదిన ఇచ్చిన చిల్లర డబ్బులను జేబులో వేసుకున్నాను.

"వదినా"

"ఊఁ......"

"సాయంత్రం వచ్చేసరికి ముస్తాబై వుండాలి"

"ఏమిటీ ప్రత్యేకత"

"మరేంలేదు వదినా. ఈరోజు నా కొచ్చేది మొదటిజీతం కదూ. సినిమాకు వెళదాం."

'నిజంగానా" నవ్వుతూ అంది.

"ఒట్టు"

"సరేలే"

మళ్ళీ గడియారంకేసి చూశాను. రెండు నిమిషాలు మిగిలాయి నేను ఊహించుకున్న సమయానికి. వదిన ఏదో చెప్తున్నా వినిపించుకోకుండా గబగబా అడుగులను బయటకు వేశాను.

బస్టాండుకు చేరుకున్నాను. బస్సు ఒక్కటీ రావటంలేదు. చేతిగడియారంకేసి చూశాను. పైపెచ్చు పది నిమిషాలు.

తల గిర్రున తిరిగినట్లయింది ఈ రోజు బట్టతలాయనతో చివాట్లు తప్పవు. రోజూ మామూలే అయినా ఈ రోజు భయంగా వుంది.

మరొక అయిదు నిమిషాలు గడిచాయి.

ఛీ...పాడు బస్సులు, సమయానికి ఒక్కటీ రాదు.' విసుక్కోవటం నావంతు అయింది.

ఏం చెయ్యను? నిద్ర పాడుచేసుకొని ఎంత త్వరగా లేచినా ఈ బస్సుల దగ్గరే ఆలస్యం.

ఇక నాకు దొరికాడు మా ఆఫీసరయ్య. వుంచుకున్న మొగుడులా మాట్లాడాడు.

బస్సు ఒకటివచ్చి నిలబడింది. నిండానిండి మర్రివూడల్లా వ్రేలాడుతున్నారు జనం. మరి అట్లా వేలాడటంలో నాకు అంతగా అలవాటులేదు. అయినా ప్రయత్నంచేసి చూశాను. ఒక్క కాలు పట్టేంత స్థలమాత్రం లభించింది. కిటికీ చువ్వల్ని పట్టుకొని వుడేసుకున్నవాడిలా వ్రేలాగాను. బస్సు కదిలింది.

దేముడి దయవల్ల ఆఫీసరయ్య ఈ రోజు లేటుగా రావాలి. ఇంకేముంది. ఆ దేవునికి మంచి కొబ్బరికాయతెచ్చి కొడతా.. మొత్తానికి ఆఫీసరయ్య బారినుండి తప్పించుకునే ఊహాలు అల్లుకుంటూ నిలబడిపోయాను.

ఈలోగా బస్ స్టేజి వచ్చింది. బస్సు ఆగిపోయింది. నేను దిగిపోయాను.

చిదికిలిలోవున్న చిల్లర డబ్బులు ఘల్లుమన్నాయి నాకు ఆశ్చర్యమేసింది. కొద్ది క్షణాల తర్వాత నవ్వుకూడా వచ్చింది. ఇలా రోజూ బయటికి వ్రేలాడటంలో టికెట్ తప్పుతుంది. ఈ రోజు ఆఫీసుకు ఆలస్యంగా వెళ్ళిన పర్వాలేదు బస్సు ప్రయాణంలో ఒక కొత్త అనుభవం గడించాను.

ఆఫీసు సమీపించింది. ఎదలో కొదు అగు పడింది. నా గుండె గుభేల్మంది.

చిన్నగా పిల్లి అడుగులు వేస్తూ వెళ్ళి కుర్చీమీద కూర్చొని నిన్నటి రోజున, సగానికి వ్రాసిన 'నకల్ను పూర్తి చెయ్యటంలో నిమగ్నుడయ్యాను స్ప్రింగ్ డోర్ తెరుచుకొని ప్యూను ప్రవేశించాడు. వాడికేసి చూడకుండా ఫైళ్ళల్లో తల దూర్చుకొని కూర్చున్నాను.

"సార్! మిమ్మల్ని గారు రమ్మంటున్నారు" చెప్పి వెళ్ళిపోయాడు ప్యూను.

శరీరం నిండా చెమటలు పోశాయి ధైర్యాన్నంతా కూడగట్టుకొని లేచి అటెన్షన్ పొజిషన్లో నిలబడి గళ్లా సవరించుకొని ఆఫీసరు గదిలోకి ప్రవేశించాను.

గుడ్ మార్నింగ్ సార్ మాటలు చిన్నగా ఒక సెల్యూట్ కొట్టాను.

'గుడ్ మార్నింగ్' తల కిందికి వంచుతూ అన్నాడు.

ఏమడుగుతాడో అడిగిన దానికి ఏం సమాధానమివ్వాలో ఊహించుకుంటూ రోజూ రిహార్సల్ చేసుకొంటాను.

కందిరీగలా రొద చేసుకుంటూ తిరుగుతోంది ఫ్యాను. గాలికి టేబులుమీద పరుగెత్తే కాగితాలు వణుకుతున్నాయి.

గోవిందరాజుల గుళ్లలా, నున్నగా వెనుకభాగం కొరుడిక్కలా వుంటుంది ఆఫీసరయ్య బట్టతల. అల వెంట్రుకలు సరిగా లేవు. వున్నవే నాలాంటి నాలుగుపోసలు. గాలికి అటూ ఇటూ పరుగెడుతున్నాయి.

నోట్లోవున్న చుట్టను ఇవతలకి తీసి, నాకేసి చూస్తూ 'రేపటి నుండి ఆఫీసుకు రా నక్కర్లేదు లేవోయ్" అన్నాడు.

అతని మాటలు పూర్తిగా అర్థంకాలేదు.

"ముందేచెప్పానుగా ఇది టెంపొరరీ జాబ్ అని. బడ్జెట్ లేదు. చాలా మందిని తీసివేశాము" ఏవో కాగితాలు వెతుక్కుంటూ అన్నాడు.

ఆయనగారి మాటలు వినేసరికి శరీరం నిండా చెమటలు పోశాయి. తల గిర్రున తిరిగినట్లయింది. తాడిచెట్టులా నిలబడిపోయాను.

"అప్పుడప్పుడూ కలుస్తూ వుండు. ఈ లోగా ఏదైనా ఖాళీ ఏర్పడితే చూస్తాను," తల ఎత్తి నాకేసిచూస్తూ అన్నాడు

ఇకనేను అక్కడ నిలబడలేకపోయాను. ఒక్కసారి ఆఫీసరయ్య వేపు చూసి గబగబా బయటికి నడిచాను.

* * *

వాళ్ళు వ్యకుంటూ ఇంటివేపు నడిచాను. పక్కగా ముస్తాబై కిటికీ దగర నిలబడింది వదిన.

"ఏమిటలా దిక్కుమొహం వేశావు?" ఇంట్లోకి అడుగుపెట్టగానే వదిన అడిగేసింది.

అసలు విషయం చెప్పాలా? చెప్పకూడదా? అన్న సంశయంలో పడిపోయాను. చివరకు చెప్పాలనే నిశ్చయించుకున్నాను.

"ఉద్యోగం వూడిపోయింది వదినా" తెచ్చిన జీతం చేతిలో పెడుతూ చెప్పాను.

క్షణంపాటు నోటంట మాటలు పెగలక చూస్తూ నిలబడిపోయింది.

కొద్దిసేపటికి "పోతే పోయింది. నీకు విద్య వుంది. ఇది కాకపోతే మరొకటి దొరుకుతుంది." ధైర్యం చెప్పింది వదిన.

ఆలోచిస్తూ కూర్చున్నాను.

భోజనంచెయ్యాలంటూ ప్రతిమిలాడింది వదిన. ఆకలిగా లేదంటూ చెప్పేశాను ఒక్కడినే సినిమాకు వెళ్ళమన్నా వినక దబ్బులిచ్చింది. వెళ్ళననిచెప్పేసి వెళ్ళి మంచంమీద పడుకున్నాను.

* * *

వారం రోజులు రోడ్ ఇన్స్పెక్టర్ జాబ్ చేశాను. ఉద్యోగం దొరుకుతుందన్న లక్షణాలు నా ఊహలకు తట్టటంలేదు. తిరగని ఆఫీసంటూ లేదు.

ఒకరోజు ఎంప్లాయిమెంటు ఆఫీసుకు వెళ్లాను. ఆఫీసు పనివాళ్లు ఇంకారాలేదు ప్రక్కనవున్న వెయిటింగ్ వెళ్ళి కూర్చున్నాను. మరి కొద్ది క్షణాలకు మరొకతను వచ్చి నాఎదురుగా కూర్చున్నాడు. కొద్ది నిమిషాల తర్వాత మా ఇద్దరి సంభాషణ ప్రారంభమయింది.

అతడు నాలాగే ఉద్యోగం కోసం తిరుగుతున్నాట్ట. నా గొడవ కూడా అటువంటిదేనని చెప్తున్నాడు. అట్లాగా అంటూ సానుభూతి చూపకుండా వుండలేకపోయాను.

చివరికి అతను నాకొక విషయం చెప్పాడు.

అతనికి పరిచయుంగల ఒక కాంట్రాక్టరు

డట. అతనికి పలుకుబడి కూడా బాగావుందని శ్లాఘించాడు. మొన్న జరిగిన ఎలక్షన్‌లో చాలా కొద్ది మెజారిటీతో పోయాడని చెప్పాడు. అతడు దాదాపు యాభై మందికి ఉద్యోగా లిప్పించాడట అవుతె ఒక వందరూపాయలు నీవి కావనుకుంటె మరుసటి రోజే ఉద్యోగంలోకి చేరుతావు. నేను కూడా ఈరోజు వారిని కలిశాను. అని చెప్పాడు. నేను కూడా తప్పకుండా కలుస్తానని అతనిచేత చిరునామా వ్రాయించుకొని ఇంటి ముఖంపట్టాను

ఈ విషయం రాత్రి అన్నయ్య. వదినతో చెప్పాను. వంద రూపాయలు ఇస్తామన్నారు.

* * *

మరుసటిరోజు వందరూపాయలనోటు జేబులో వేసుకొని ఆ దేశనాయకుడి ఇంటికి వెళ్ళాను.

చిన్న బంగళా. చుట్టూ ప్రహరి ప్రహరి అవరణలో చుట్టూ చెట్లున్నాయి చెట్లకు వుండవల్సిన పువ్వులూ వున్నాయి

బయట ఎవ్వరూ అగుపడకపోయేసరికి కాలింగ్ బెల్ నొక్కాను. కొద్దిక్షణాలకు ఒక వ్యక్తివచ్చి వివరాలన్నీ అడిగి లోపలికి ప్రవేశపెట్టాడు.

ఎదురుగా వున్న సోఫాలో కూర్చున్నాడు ఖద్దరు దుస్తులు, నెత్తికి తెల్లటోపి. కళ్ళకు అడ్డంగా కళ్ళజోడు నాయకుడికి వుండవల్సిన లక్షణా లన్నీ వున్నాయి

నాకేసి చూస్తూ కూర్చోమన్నట్లు చెయ్యితో సైగ చేశాడు.

నమస్కారంచేసి ఎదురుగావున్న కేన్ చేర్‌లో కూర్చున్నాను. రెండు నిమిషాల్లో నా గొడవంతా విన్నవించుకున్నాను.

'ఎంతవరకు చదివావు?" చేతిలో వున్న పత్రిక ను తిరగేస్తూ అడిగాడు.

'బి. ఎ" మెల్లగా చెప్పాను.

"ఏం ఉద్యోగం కావాలి?'

"ఏదో...మీ దయ'

"సరే. తిరిగి రేపొకసారి కలువు" సోఫా లోంచి లేస్తూ అన్నాడు.

జేబులోవున్న వందరూపాయల నోటును ఒక్కసారి తడిమి చూచుకొని ఆయన కిచ్చాను. వంద రూపాయల నోటును చూస్తూనే చాలవన్నట్లు కాబోలు పెదవి విరిచాడు.

ముఖంలో దీనత్వం ఉట్టిపడేలా. అమాయకంగా అతనివేపు చూస్తూ నిలబడిపోయాను.

'ఇంతే తెచ్చావా?" నోటును లాల్చీ జేబులోకి నెడుతూ అన్నాడు.

'అవునండీ. ప్రస్తుతం ఇంతేవుంటె తెచ్చాను" వీళ్ళ నమిలాను.

కనుబొమ్మలు ముడేసి 'తతిమ్మావి రేపు పత్రా" అనేసి లోపలికి వెళ్ళిపోయాడు.

రెండునిమిషాలు నిలబడి తిరిగి ఎవ్వరిదర్శనం కలగకపోయేసరికి ఇంటిముఖం పట్టాను.

* * *

నెల రోజులు గడిచాయి.

ఇంతవరకు ఆ నాయకుడు ఉద్యోగం చూసిన పాపాన పోలేదు. నేను ఉద్యోగం చేసిన పాపాన పోలేదు. వంద రూపాయిలు మాత్రం దొంగ చేతికిచ్చినట్టు ఆ నాయకుడి కిచ్చాను.

'ఎవడికో ముంచీవెడూ తెలియకుండా అడ్డమైన వాడికి డబ్బు తగలబెట్టావు" అంటూ అన్నయ్య సాగదీస్తున్నాడు.

అన్నయ్య మాటలకు వదిన ఖిన్నురాలవుతోంది. నా మూలకంగా వదినకు చివాట్లు తప్పడంలేదు.

అప్పులు దినదినానికి తమ పలుకుబడిని పెంచుకుంటున్నాయి. నా పరిస్థితికి దినదినానికి నాకే అసహ్యమేస్తోంది

'ఇటు డబ్బు పోయింది. అటు ఫలితం దక్కకుండా అయింది." ఈ విధంగా నాన్న శృతి కలుపుతున్నాడు.

చివరికి ఒక నిశ్చయానికి వచ్చాను. ఎలాగైనా ఈ రోజు ఆనాయకుడిగాడిని నిలదీసి అడుగుతాను. అడిగినప్పుడల్లా ఇదిగో అంటాడు అదిగో అంటాడు ఇచ్చినవి మాత్రం స్టేట్ బ్యాంకులో జమకట్టినట్లు లాల్చీ జేబును నింపుకుంటాడు. ఏమిటీ నాయకులు? దేశాన్ని ఉద్దరించే నాయకులేనా వీళ్ళు? డబ్బు తినికూడా పనిచేయని నాయకులుంటారా? మరి ఎలాంటి నాయకులు పనిచేస్తారు? ఆలోచించుకుంటూ నాయకుడి ఇంటికేసి నడిచాను.

నాయకుడి ఇంటిముందు గుంపులు గుంపులుగా మూగివుంది జనం. అల్లర్లు కేకలు స్పష్టంగా వినబడసాగాయి. గబగబా నడుస్తూ ఆ గుంపును సమీపించాను.

"బయటికి లాగండ్రా. తన్నండి ఇంకా చూస్తున్నారేం? వెధవ రాస్కెల్ వీడూను..." జన సమూహంలోంచి ఈ మాటలు నా కర్ణేంద్రియాలకు స్పష్టంగా వినిపించాయి.

అసలు సంగతి ఏమిటో అర్థంకాకుండా వుంది. ఒక్కసారి చుట్టూ కలియచూశాను. నాయకుడు గాని వాళ్ళ ఇంటివాడుగాని ఎవ్వరూ అగుపడ లేదు. ప్రక్కన వున్నతన్ని మెల్లగా అడిగాను.

"వీడు మహా నాయకుడని చెప్పారండీ ఉద్యోగం ఇప్పిస్తానని ఆశచూపి మా వద్దనుండి రెండు నూర్లు పోయించుకున్నాడు. ఇప్పటికి మూడు నెలలు గడిచాయి ఉద్యోగంలేదు వీడూ లేడు. మహా దేశోద్ధారకుడు ఈ రోజు ప్రత్యక్షమయ్యాడు." కోపంతో వూగిపోతూ చెప్పాడా యువకుడు.

అంతా అగమ్యగోచరం గావుంది నాకు. విచిత్రంగా గుంపుకేసి చూశాను. లోపలినుండి ఆ నాయకుడ్ని బయటికి లాక్కొస్తున్నారు. మరి కొందరు ప్రక్కనుండి కొడుతున్నారు.

వరండాలో నిలబడిన ఇద్దరు చిన్న పిల్లలు వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. ఎరుపుగా, బలంగా, ఆరోగ్యంగా వున్నారు.

వాళ్ళను చూస్తున్నకొద్దీ నాలో ఒక విధమైన మార్పు కలిగింది ఆ చంటిపాపల కళ్ళనుండి కారుతున్న నీటి బిందువులను చూస్తున్నకొద్దీ నాలో అమితమైన జాలి ఏర్పడింది. కాని, ప్రస్తుత కర్తవ్యం ఏమిటా అని ఆలోచిస్తున్నానే కాని ఏం చెయ్యాలో తోచటంలేదు.

పావుగంటసేపు తమ ప్రతాపమంతా ఆ నాయకుడిమీద ప్రయోగించుకున్నారు ఆవేశంతో వూగిపోతున్న యువకులంతా. స్పృహ లేకుండా నేల మీద పడిపోయిన ఆ నాయకుడు అగుపడ్డాడు. గుడ్డలు బాగా నలిగిపోయాయి కళ్ళజోడు ముక్కలు ముక్కలుగా విరిగిపోయింది. స్థానాన్ని విడిచిన తెల్లటోపి దూరంగా నిలబడి చూస్తోంది. నా కాళ్లు అప్రయత్నంగా అతనికి సమీపంగా కదిలాయి.

పోలీస్ వ్యాన్ రివ్వునదూసుకుంటూ కాంపౌండ్ లోకి ప్రవేశించింది. తలెత్తి చుట్టూచూశాను. నేనూ నాయకుడూ తప్ప ఆ కంపౌండ్‌లో మరెవ్వరూ కనిపించలేదు.

వ్యాను దిగిన పోలీస్‌వాళ్ళు ముందుగా నా కేసి చూసి, వచ్చినబృందం రెండుగా విడిపోయి. నాయకుడిని హాస్పిటల్‌కు తీసికెళ్ళారు.

మరొక బృందం నన్ను వ్యాన్‌లో ఎక్కించుకొని పోలీస్ స్టేషన్‌కేసి తిప్పారు వేగంగా పరుగెడుతున్న వ్యానును. ★

